# 8. తొంగి చూసిన చందమామ

నిలువుటద్దంలో పరాకుగా చూస్తే తొమ్మిదిన్నరలా కనిపిస్తోంది. కాని అప్పుడు రెండున్నరే అయింది. హేమలత గుండెల్లో గువ్వ ఒక్కసారి రెక్కలు విదుల్చుకుంది. ఈ గూడులోంచి ఎగిరిపోవడానికి యింకెంతసేపు, యింకెంతసేపు గనక! అద్దంలోని తన ప్రతిబింబంవైపు చూసుకుంటూ, ఎడమచెయ్యి దగ్గిర ఆగి, నవ్వుకుందామని విఫలయత్నం చేసింది హేమ. ఏముంది అక్కడ? మణుకు దగ్గిర్నుంచి మణికట్టువరకూ ఇన్సులేషన్ ఊడతీసిన రాగితీగె దగ్గిరగా బలంగా చుట్టబడివుంది. టేబిల్ లైటునుంచి, కత్తెరతో కట్‌చేసి తనే ఆ వైరు ఒకవైపు అరగజంమేర బ్లేడుతో చెక్కేసి ఎడంచేతికి చుట్టుకుంది. కుడిచేత్తో ప్లగ్‌పిన్ పట్టుకుంది. మూడూ కొట్టేసరికి దాన్ని ప్లగ్‌లో పెట్టేస్తుంది. ఆ తరవాత ఏమౌతుంది? ఏమైతే ఎవరిక్కావాలి! చాలు, సిగ్గులేని యీ జీవితం యింక చాలు! దెబ్బలు తిని గుడ్డలు మోసే గాడిదకీ, తన్నులు తిని యింటిచాకిరీ చేసే ఆడదానికీ ఏమిటి తేడా? ఆ కన్నీటి తెరలో వెలుగుతున్న బల్బుకాంతి అలుక్కుపోయినట్టు కనిపించిది ఆమెకి. కరెంటు ఉందో లేదో తెలుసుకోడానికి పట్టపగలే లైటువేసి ఉంచుకుంది హేమలత.

ఈ మధ్య వారంరోజులై, ఏ క్షణానికిక్షణం చచ్చిపోదామనే కోరిక ఆమెలో మరీ బలపడజొచ్చింది. మండుతున్న కర్రల్ని చూసినా, కాళ్ళెత్తి నూతిలోకి తొంగిచూసినా, దూలంమీది చేంతాడుని చూసినా ఆమెకు మరీ యెక్కువగా ముచ్చెమటలు పోసేవి. మూడిళ్లవతల వున్న నర్సింగ్ హోమ్‌లోంచి కొట్టుకొచ్చే రకరకాల మందువాసనలూ, వీధిలో కర్రలు కొట్టించుకుంటూన్నప్పుడు గొడ్డలి అంచు మెరుపులూ, స్టేషన్ వదలి వెళ్ళిపోయేటప్పుడు రైలుచక్రాలు చేసే చప్పుళ్ళూ, యిన్ని పద్ధతులు ఉన్నాయి. ఇందులో ఒకటి ఎందుకుపయోగించవు? అని హెచ్చరిస్తూనే ఉన్నాయి.

అన్నీ ఆలోచించి ఈ పద్ధతి ఎంచుకుంది హేమలత. ఇంకా తనకిక్కడ ఏం మిగిలివుందని దేవుళ్ళాడాలి! మూడుముళ్ళూ వెయ్యకుండానే, తనని బందీచేసి బానిస చేసుకున్నాడు యీ దరిద్రుడు!.

వేడినెత్తురు చేసిన వెర్రి పాపానికి తొమ్మిదినెలల విడి ఖయిదు వేసింది ప్రకృతి.

'ఇప్పుడు మాత్రం నీకు విడుదల యెక్కడిది? ఎలా తప్పించుకుంటావో నేనూచూస్తాను' అని అభిమానమనే ఆయుధం పట్టుకుని ఏడేళ్ళయి కాపలాకాస్తోంది ఎదుగుతున్న ఫలశ్రుతి!

వీళ్ళనుంచి తనకి విముక్తిలేదా! పొరపాటు, తననుంచి తనకే విముక్తి లేకపోయిది. తనుచస్తానంటే వీళ్లు అడ్డొచ్చారా? అయిదునిమిషాలు తక్కువ మూడయింది. ఇంకొక అయిదునిమిషాలు దాటితే తను, తనకింక అడ్డురాదు. తనలోని గువ్వ రివ్వున ఎగిరిపోతుంది.

యింకో అరగంటకి గాని కూతురు యింటికిరాదు.

రంగారావు సరేసరి, ఆరోజు డేటుమారితేగాని యిల్లు చేరడు. చేసిన ఆలస్యం చాలు.

బీరువాలోని నిలువుటద్దం వీధికి ఎదురు, తను యిటువైపు తిరిగినా అద్దంలో ఎవర్నైనా

చూడొచ్చు. వీధితలుపు యింతసేపూ గడియవేసుకోనందుకు తన్ను తాను తిట్టుకుంటూ లేచింది హేమలత.

అంతలో బల్బు ఆరిపోయింది! పక్కగదిలో లైట్లుకూడా వెలిగించి చూసి, కరెంటు ఆగిపోయిందని తెలుసుకుని, చప్పగా కూలబడిపోయింది ఆమె! తన ముఖంమీద సుఖం ఎలాగా రాసిపెట్ట లేదు, దు:ఖంనుంచి పారిపోడానిక్కూడా అవకాశం లేదా? తనని వెక్కిరిస్తూ గోడగడియారం మూడుకొట్టింది. మబ్బు విడిచిన సూర్యకాంతి ఒక్కసారి గదిలోకి వచ్చి అద్దం అంచుల మీదపడి మిరుమిట్లు గొలిపితే కళ్ళు మూసుకుంది హేమలత, చేతకాని తనంతో వెర్రిదు:ఖం వచ్చింది ఆమెకి. 'ఇంకా కన్నీళ్ళు మిగిలిఉన్నాయా?' అనుకుని 'ఈ కళ్ళకు ఒకప్పుడు బుద్ధి అన్నది ఉందిగనకనా?' అని జవాబు చెప్పుకుంది ఆమె. అతని కళ్ళలో వేడీ వెలుతురూ లభిస్తాయని తనని మోసం చేసి, నాశనం చేసింది యీకళ్ళేకదా!

ఎంత అన్యాయంచేశాడు రంగారావు తనని! ఎన్నెన్ని మాటలు అన్నాడని! ఆవైనా ఎలాంటి మాటలు!

"పదవే' అనగానే, 'భళిరా' అని బయల్దేరి వచ్చేశావు. నీది లూజ్ కేరక్టరు కాదని రుజువేమిటి? నీ కూతురు నాదేనని సాక్ష్యమేమిటి? నీ మొహానికి పెళ్ళి ఒకటే తక్కువయిందా? ఇంకా మంచివాణ్ణి కాబట్టి, నలుగురూ నీ మొహాన్ని ఉమ్మేస్తారని నిన్ను నా పెళ్ళామని చెప్పుకుంటూ యింత కూడూగుడ్డా పడేస్తున్నాను. కృతజ్ఞతతో పడిఉండక, మాటకిమాట జవాబు చెప్పడానికి నీకెంత ధైర్యమే!"

"నువ్వంటేనే మంటెత్తుకొచ్చినా అప్పుడప్పుడు చీకట్లో వెచ్చదనంకోసం వెర్రిపడతానుగాని, నీ ఏడుపు మొహం చూస్తూ నిన్నే అంటిపెట్టుకు ఉండడానికి నాలో మొగతనమంతా మొద్దుబారి పోయిందనుకున్నావటే? నువ్వుమాత్రం? నాకోసమే కనిపెట్టుకు ఉంటావని నమ్మకమేముంది?"

ఎంత వద్దనుకున్నా హేమలతకి రంగారావు మాటలు వినపడుతూనే ఉన్నాయి.

"నిన్నేనాడు లేవదీసుకు వచ్చానో ఆనాడే నాలో నీతీ నియమం చచ్చేయి. ఇంక నేనెలా సంపాదించుకు వస్తే నీకెందుకు? ఇంకా మనిషినిగనక-ఇంట్లో పొయ్యి మీదకీ పొయ్యికిందకీ ఏ వేళప్పుడు ఏంలేక ఏడుస్తూ ఉంటావో అని, ఎక్కడో ఎవర్నో మసిపూసి మారేడుకాయచేసి యిల్లు నింపుతూ ఉంటాను. ఇంద యీ పాతికా అఘోరించు."

"చేతకాక కూతుర్ని కొట్టుకుంటావెందుకే సిగ్గుమాలినదానా! రేప్పొద్దున్న నువ్వు ముసల్దానివయిపోయాక, నీకిన్ని గంజినీళ్ళు కాచిపోసే దిక్కు అదేనే! ఆవుకి ఆడదూడ పుట్టినా, చెడినదానికి ఆడబిడ్డపుట్టినా ఎప్పటికయినా వ్యాపారం వృద్ధిలోకి వస్తుందని నీకు తెలీదుటే?"

ఎన్నిసార్లు, ఎన్ని విధాల వాగినా దాని సారాంశం ఒకటే. అలాంటి నిందకి తను ఏనాడో అలవాటు పడిపోయింది. కాని తన ఆత్మ గిల గిల తన్నుకుంది యింకొక కారణంచేత.

పడుకునే గదేకాక పాకీదొడ్డిని కూడా ప్రతీ అంగుళం పరిశుభ్రంగా ఉంచుకునే పరమపావనుల

వంశానికి చెందింది ఆమె, తనవారిని విడిచి రాగలిగినా తన జన్మతో తెచ్చుకొన్న పరిశుభ్రతని వదిలి పెట్టలేకపోయింది హేమలత. రెండ్రోజులు భోజనమయినా మానెయ్యగలదుగాని రోజుకి రెండుసార్లు స్నానం చెయ్యందే ఉండలేదు ఆమెను వేధించుకు తినడమే జీవితాదర్శమనుకున్న రంగారావు ఆమె సౌఖ్యానికి కేంద్రమెక్కడో తెలుసుకున్న తర్వాత ఒక్క నిమిషం కూడా వృధాచెయ్యలేదు.

'నన్నిలా బతకనియ్యి, నీకూ నీ పెద్దలకీ దండం, అని ఒక్కలా ఏడుస్తూంటే ఆ గుంట ముండ నెందుకే చిక్కుతీసి, బలవంతాన అణచిపెట్టి తలదువ్వి అలా ఏడిపిస్తావ్? నిత్యాగ్నిహోత్రుల కొంపకి నువ్వింతగా చిచ్చుపెట్టేవు, చాలింది కాదూ? లేచివచ్చిన నీతి పరురాలివి, నువ్వూ చెప్పడమే శుభ్రం గురించి కబుర్లూ? దీనిపని యిలాకాదు. చిట్టీ, యిలారా, కబురూ'' తను వద్దన్నా తనమాట వినలేదు అది, తండ్రి దగ్గరకి పరిగెట్టింది. ఒక పావు గంటసేపు అలాగే అచేతనంగా ఉండిపోయింది. తను తర్వాత లేచి వెళ్ళిచూస్తే తను నీటుగా ఉంచుకున్న బొట్టు పెట్టి, బట్టల పెట్టి, వీలయినంత చిందర వందర చేయబడి ఉన్నాయి. తోమి ఉంచుకున్న అన్ని గిన్నెల్లోనూ కిళ్ళీ ఉమ్ములు! ఆవకాయ జాడీలో బీడీపీకలు! తువ్వాళ్ళ నిండా దుప్పట్ల నిండా తలనూనె మరకలు! దేవుడి గూట్లో ఊదొత్తుల స్థానే ఒకేసారి వెలుగుతున్న నాలుగు సిగరెట్లు! అన్నీ కోల్పోయినట్టు బాధపడుతున్న తన్ని చూసి తండ్రీ కూతురూ తన హృదయాన్ని పరపర కోస్తూ పక పక నవ్వులు!

ఇంక దేన్ని చూసుకుని బ్రతకాలి తను!

తెల్లగా మారిపోయిన ఎలక్ట్రిక్ బల్బువైపు ఎర్రగా చూస్తూ కూచుంది హేమలత, మరేం మించిపోయింది లేదు, యిలా కరెంటు ఆగిపోయి ఎంతసేపు ఉంటుందో నేనూ చూస్తాను! అనుకుంటూ.

'అమ్మా' ఎవరో పిలిచారు.

లేచి వెళ్ళే ఓపిక లేక పక్కకి తిరిగి అద్దంలో చూసింది హేమలత. ఎవడో ముసలి ముష్టివాడు.

'భోజనాలైపోయాయి, ఇప్పుడేంలేదు పో'... అక్కణ్ణుంచే విసుగ్గా అరిచింది.

'చిన్న సబ్బుముక్క ఉంటే పడేద్దూ తల్లీ!'

తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది ఆమె,

' ఏమిట్రా నువ్వు అడుగుతున్నదీ?' అని మళ్ళీ కేకెట్టింది.

'ఏ సబ్బయినా సరే.... ఎంత చిన్న ముక్కయినా సరే..... నువ్వు తలుచుకుంటే ఇవ్వలేకపోవు. తలరుద్దుకుని ఎన్నాళ్ళో అయింది. కొళాయిదగ్గిర తల తడుపుకుంటాను. తల్లి, తల్లి.... కాదనకు'.

ఇంక కూర్చోలేకపోయింది హేమలత. విప్పారిన కళ్ళతో వీధిలోకి వచ్చింది. మురికి ఓడుతున్నటున్న మొహమూ ముప్ఫైమూడు ముడతలతో ఉన్నది. అయినా ముసలితాత అద్దంచూచుకునే ముచ్చట మానుకోదల్చుకోలేదు! ఏం ఖర్మం కాలిపోయిందని తను మానుకోవాలి! హేమలత ఛర్రునలేచి నిలువుటద్దం దగ్గరకు వెళ్ళి ప్రేమగా తన ముంగురుల్ని సవరించుకుంది, ఈసారి ముసలితాత మొహం

తనని చూసి నవ్వుతున్నట్టునిపించింది, ఒళ్ళు మండిపోయింది.

'ఏదో ముసలాడివిగదా అని లోపలికి రానిస్తే, సొంతయిల్లనుకున్నావా ఏమిటి, అదేపనిగా ఆక్రమిస్తున్నావ్, వెళ్ళు వెళ్ళు''.

ముసలాడు తెల్లబోయి, జోలీ, కర్రా పట్టుకుని గావంచా తీసుకుని నడచిపోయాడు హడావిడిగా.

'ప్రతీ వెధవకీ నేనంటే లోకువై పోయింది. అడిగేవాడు లేకపోతేసరి' అనుకుంది హేమలత, గుప్పెడు జంతికల గుండ నోట్లో పోసుకుంటూ. ఆ 'వెధవ' ల లిస్టులో చిట్టితోపాటు రంగారావుకూడా ఉన్నాడని ఆమెకు తెలుసు. తెలిసినందుకు ఆమె చలించలేదు. ఇక ముందు చలించదలుచుకోలేదు కూడా!

★